కార్మికుడా.. నిన్ను ప్రభుత్వం గుర్తించిందా!

- అసంఘటిత కార్మికులు.. కార్మిక శాఖ గుర్తింపు కార్డులకు దూరం
- భవన నిర్మాణ, అనుబంధ కూలీలకు ఎంతో మేలు
- ఒకసారి కార్డు పొందితే ప్రయోజనాలెన్నో..
- భృతితో కూడిన నైపుణ్య శిక్షణ, 60 ఏళ్లు దాటితే పింఛను
- పిల్లలకు ఉచిత విద్య, వివాహాలకు నగదు సాయం
- మంగళగిరిలో 16 వేలకు పైగా కార్మికులు



పాత బస్టాండ్ సెంటర్‌లో పనుల కోసం ఎదురు చూస్తున్న కార్మికులు

మంగళగిరి: భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మిగిలాయి. మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ పరిధిలో సుమారు 23 వేల మందికిపైగా కార్మికులున్నారు. భవన నిర్మాణ రంగంతో పాటు పెయింటర్లు, కార్పెంటర్లు, ప్లంబర్లుగా అనేక మంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం కార్మికులు ప్రతి రోజూ పని కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. మంగళగిరితో పాటు తాడేపల్లి, తాడికొండ ప్రాంతాల నుంచి ప్రతి రోజు ఉదయం మంగళగిరి పాత బస్టాండ్, ఆటో నగర్, తాడేపల్లి అడ్డాలకు చేరుకుని పనుల కోసం ఎదురు చూస్తుంటారు. కొందరికి నిత్యం పని దొరుకుతున్నా మరికొందరు కూలీలు పని లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆధారపడిన అనేక రంగాలు

మట్టి పని, పునాది గుంతలు తీయడం, చదును, తాపీ మేస్త్రీ, కూలీలు, రాడ్‌బెండింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, సెంట్రింగ్, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, పాలిష్ వేసేవారు, సీలింగ్ వర్కర్లు, కంకర ముఠా కార్మికులు, రోడ్డు నిర్మాణ కూలీలు.. క్రేన్, పొక్లెయినర్ ఆపరేటర్లు భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవిస్తుంటారు. వీరు కాక చెరువులు తవ్వడం, పూడిక తీయడం, బోర్‌వెల్స్, సిమెంట్ వరలు, ఇటుకలు తయారు చేసేవారు ఇదే రంగంపై ప్రధానంగా ఆధారపడి ఉన్నారు. వీరికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు పని భద్రత కల్పించాలి. గుర్తింపు కార్డులు పొందాలంటే లేబర్ ఆఫీసులో ఆధార్, రెండు ఫొటోలు, నామిని ఆధార్ కార్డుతో పాటు రూ.50 సభ్యత్వ రుసుం చెల్లించాలి.

గుర్తింపు కార్డు ప్రయోజనాలెన్నో...

అయితే గుర్తింపు కార్డుల విషయంలో కార్మికులకు అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది వీటిని పొంద లేకపోతున్నారు. కార్మికుల నైపుణ్యం పెంపొందించుకునేందుకు శిక్షణ ఇవ్వాలి. శిక్షణ కాలంలో రూ.300 స్టైఫండ్ ఇస్తారు. 60 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.1000 నుంచి రూ.5000 పెన్షన్ అందజేయాలి. భవన యజమానులు నిర్మాణం రిజిస్ట్రేషన్ చేసి పనిచేసే కార్మికుల పేరిట 1 శాతం కార్మిక శాఖకు సెస్ చెల్లించాలి. కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి. వివాహాలకు నగదు చెల్లించాలి. వీటిపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మికుల పథకాలపై అవగాహన కల్పించి వారికి అన్ని పథకాలు అందేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.



కార్మికుల వివరకాలు సేకరిస్తున్న లేబర్ ఆఫీసర్ శ్రీరామమూర్తి

దీనిపై లేబర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీరామమూర్తి స్పందించారు. గత కొద్ది రోజులుగా కార్మికుల అడ్డాలకు వెళ్లి కార్మికుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మంగళగిరి పరిధిలోని కార్మికుల వివరాలను పూర్తిగా సేకరించి, వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

పార్టీ బలోపేతానికి బాటలు వేయాలి

వైఎస్సార్‌సీపీ తాడికొండ సమన్వయకర్త వజ్రబాబు



వజ్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీటీసీ కత్తి రేణమ్మ, మహిళలు

తాడికొండ: విభేదాలు వీడి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. గుంటూరు మల్లికార్జున పేటలోని తన కార్యాలయంలో ఫిరంగిపురం మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెద్ద కుటుంబమని, ఇందులో లోపాలు, సమస్యలుంటే చర్చించుకొని పరిష్కరించుకోవాలే తప్ప ఒకరిపై ఒకరు అభిప్రాయ భేదాలు మనసులో పెట్టుకొని పార్టీకి నష్టం కలిగించేలా ప్రవర్తించవద్దన్నారు. కార్యకర్తల కోసం తాను కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉంటానని, ఎవరైనా, ఎప్పుడైనా తమ సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. గత పార్టీ కమిటీలు, పదవులు అన్నీ రద్దయ్యాయని, గ్రామ, మండల స్థాయి కమిటీల ఎంపిక ప్రక్రియ అందరిక సహకారంతో సమర్థవంతంగా పూర్తిచేసేందుకు ఓ సమన్వయ కమిటీని మండల స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30వ తేదీలోగా గ్రామస్థాయి కమిటీల ఎంపిక పూర్తి చేయాలని, సీనియర్లు పార్టీకి కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలలో ప్రాధాన్యతనిచ్చి పార్టీలో మంచి గుర్తింపునివ్వడం జరుగుతుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, వివిధ విభాగాల నాయకులు చిట్టా అంజిరెడ్డి, అప్పిరెడ్డి, చిన్నప్పరెడ్డి, దాసరి మిల్కే, రంజన్ బాబు, బద్దూరి శ్రీనివాసరెడ్డి, కమలారెడ్డి పాల్గొన్నారు.

జనగణనతో పాటే కులగణన చేయాలి

మంగళగిరి: జనగణనతో పాటు సమగ్ర కుల గణన జరపాలని ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈ నెల 25న అన్ని జిల్లాల కలెక్టర్లకు విన్నవించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న సంఘం కార్యాలయంలో ఈ మేరకు సమావేశం నిర్వహించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అన్ని జిల్లా కార్యాలయంలో సంఘం ఆధ్వరంలో భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 2011లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ జనగణనతో కులగణన జరపాలని మాట్లాడి, ప్రస్తుతం మిన్నకుండిపోవడం దారుణమన్నారు. కులగణన వల్ల జాతీయ సమైక్యత దెబ్బతింటుందంటూ అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పారేపల్లి మహేష్, మేక వెంకటేశ్వరరావు, శివరామ్ బాబాజీ, ఆలా శివాజీ, వరప్రసాద్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

శ్మశానంలో ఆక్రమణలను తొలగించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంగళగిరి: దశాబ్దంగా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామం మాదిగ పల్లె శ్మశాన వాటిక ఆక్రమణలకు గురైందని, వెంటనే తొలగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. శ్మశాన వాటిక రహదారి ఏర్పాటుకు ఆక్రమణల తొలగింపు హైకోర్టు అత్యవసర నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో మృతదేహాలను తీసుకువెళ్లేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే ఆక్రమణలను తొలగించి, రహదారి కల్పించాలని కోరారు. నాయకులు చిలువూరు ప్రసాద్, నవీన్, పులి ప్రభుదాసు, కొమ్ము ఆనంద్, వినోద్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణ మెళకువలు ఎంతో అవసరం



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక

ఫిరంగిపురం: మహిళల ఆత్మరక్షణకు మెళకువలు ఎంతో అవసరమని యువజన సర్వీసుల శాఖ(స్టెప్)బి.రాధిక అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో గురువారం యువజన సర్వీసుల, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ డ్రగ్స్ అబ్యూస్, ఈవ్ టీజింగ్, సెల్ఫ్ డిఫెన్స్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ కళాశాలలో, పరిసరాలల్లో ఈవ్ టీజింగ్ పాల్పడటం ద్వారా సమాజంలో గౌరవాన్ని కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్, ఏఎస్ఐ పీఏఖాన్, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు, డి.జీవన్ మణిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎంపీ సత్యనారాయణ

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయిలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన చేపట్టారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో జరిగిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డీఎల్ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు, ఇతరులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా రేవేంద్రపాడులో కోటేశ్వరరావు పండిస్తున్న వరి పంట పొలాన్ని పరిశీలించామని తెలిపారు. దీంతో పాటు లాం ఫామ్‌లోని అంతర పంటలు, వరి పంట, సరిహద్దు పంటలను పరిశీలించామని, జీవ ఉత్ప్రేరకాలు, జీవామృతం, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాన్ని డెమో చూపించామని, రేవేంద్రపాడులోని యస్ నాగిని పంట పొలంలో 4 సంవత్సరాల పీఎండీఎస్ ఫీల్డ్, ఎస్ కోటేశ్వరరావు 3 సంవత్సరాల పీఎండీఎస్ ఫీల్డ్, జి.అనిత 2 ఏళ్ల పీఎండీఎస్ ఫీల్డ్, ఎస్.సాయి 1 సంవత్సరం పీఎండీఎస్ ఫీల్డ్‌ను సందర్శించిన వాటిలో ఉన్న మార్పులను, తేడాలను గమనించడం జరిగిందని తెలిపారు. ఆర్‌డీఎస్ విత్తన శుద్ధి చేయించి, రబీకి ముందు ఏ విధంగా వేసుకోవాలో శిక్షణ ఇచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

25వ రోజుకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్ష



దీక్ష నిర్వహిస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు గురువారంతో 25వ రోజుకు చేరుకున్నారు. కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు వారికి పూర్తి మద్దతును ప్రకటిస్తున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం వైపు నుంచి ఐటీ శాఖ, విద్యాశాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ చొరవ చూపించాలని కోరారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతాన్ని పర్యటించినపుడు ఇచ్చిన హామీలను గుర్తుంచుకోవాలని కోరుతున్నామన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు సంయుక్త కిసాన్ మోర్చా తరుపున సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు కోటేశ్వరరావు, ఆదినారాయణ, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఎం.ఆశీర్వాదం, అంకయ్య, ఎస్కే భాష, సుబ్బారావు, రమాదేవి, నవనీతం, శారద, చారమ్మ, సామ్రాజ్యం, దుర్గారావు, సాంబయ్య, యెహోషువా, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

ఉచిత సిలిండర్ బుకింగ్‌లో ఇబ్బందులు



షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : దీపం-2 పథకం ఉచిత వంట గ్యాస్ సిలెండర్ బుకింగ్‌లో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత గ్యాస్ వినియోగదారులు ముందుగా నగదు చెల్లించి, సిలిండర్ తీసుకోవాలనడం సరికాదన్నారు. సిలిండర్ అందించిన 48 గంటల్లో రాయితీ వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్న ప్రభుత్వం హామీ అమలులో సాధ్యం కావడం లేదన్నారు. నగదు చెల్లించి సిలిండర్ తీసుకుని 15 రోజులైనా ఇప్పటికీ చాలామంది లబ్ధిదారులకు నగదు జమ కాలేదన్నారు. పనులు మానుకుని గ్యాస్ ఏజెన్సీల వద్దకు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఫిరంగిపురం: అధిక ధరలకు పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పురుగు మందుల దుకాణాల అంతర్జిల్లాల తనిఖీ అధికారి కె.రామకోటేశ్వరి అన్నారు. మండల కేంద్రంలో గురువారం పురుగు మందుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. రైతులకు విక్రయించిన ప్రతి వస్తువుకు రసీదు ఇవ్వాలని కోరారు. ఆమె వెంట ఏవో వాసంతి, సిబ్బంది ఉన్నారు.

మేడికొండూరు: మండల పరిధిలోని మేడికొండూరు, పేరేచర్ల గ్రామాల్లో ఉన్న పురుగు మందుల దుకాణాలను అంతర్ జిల్లాల తనిఖీ అధికారి, పొన్నూరు సబ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు కె.రామకోటేశ్వరి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న స్టాకు రిపోర్టులను పరిశీలించారు. స్టాక్‌లో శాంపిల్స్‌ను పరిశీలించి, వ్యత్యాసాలను గుర్తించారు. ఇతనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు స్థలాలిచ్చి ఆదుకోవాలి



తాడికొండ: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు అందజేసి ఆదుకోవాలని సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు కోరారు. గురువారం తాడికొండలో పేదలకు చెందిన 80 దరఖాస్తులను పేదలతో కలిసి కార్యదర్శి హరి బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గ్రామీణ పేదలకు 3 సెంట్లు, పట్టణ పేదలకు 2 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, రేపూడి శ్రీనివాసరావు, తోకల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు పరిచయ కార్యక్రమం

తాడికొండ: నేడు మేడికొండూరు నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమం గుంటూరులోని తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు.

24న మండలస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 24 ఆదివారం మండల స్థాయి అండర్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ వంగిపురపు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. మండలస్థాయి నుంచి ఎక్కువ మంది యువ క్రీడాకారులను తయారు చేయడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల జట్లు తమ దరఖాస్తులను అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నానికి అందజేయాలని తెలిపారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

మంగళగిరి: పట్టణంలో ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం వీవర్స్ కాలనీ హైస్కూలులో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాలస్వస్థ(ఆర్‌బీకేఎస్)లో భాగంగా పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీకేఎస్ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ పీఓఎస్‌సీడీ డాక్టర్ జయరామకృష్ణ, అసిస్టెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ పవన్, ఐటీ మేనేజర్ శివశంకర్‌లు పాల్గొని పలు సూచనలు చేశారు. స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అనారోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన రోగులను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందించడం జరుగుతుందన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు హెల్త్ కార్డు అందజేయడం జరుగుతుందన్నారు. బాల్యంలో వినికిడి లోపం, దృష్టిలోపాలను గుర్తించి ముందస్తుగా వైద్యం తీసుకోవడం భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా వుండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తాడేపల్లిలో బైక్ ర్యాలీని బోసు బొమ్మ సెంటర్ నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ మీదుగా ఎమ్మార్వో కార్యాలయం, నులకపేట, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాట శిబిరం వరకు సాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టి కార్పొరేట్‌లకు కట్టబెడుతోందని వ్యాఖ్యానించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న జరుగనున్న చలో గుంటూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, కార్మిక సంఘాల నాయకులు వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, కె. కోటేశ్వరరావు, ఆదినారాయణ, కొట్టే కరుణాకర్‌రావు, కూరపాటి స్టీవెన్, వై. బర్నబాస్, బొబ్బిలి రామారావు, కె. బాబూరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు నూతక్కి విద్యార్థులు



మంగళగిరి: ఈ నెల 23, 24వ తేదీల్లో జరగనున్న 68వ రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్ షిప్ పోటీలకు నగర పరిధిలోని నూతక్కి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ కె.రజనీ నాయక్ తెలిపారు. బుధవారం పీడీ మాట్లాడుతూ రగ్బీ పోటీలకు గుంటూరు జిల్లా బాలికల జట్టుకు విద్యార్థులు ఎ.శ్రీలక్ష్మీ, డి.షారోన్ కృపవల్లి, ఎస్కే సుమియా, పి.ఉష్మా ఎంపికైనట్లు తెలిపారు. హెచ్ఎం జేమ్స్‌వాణి , ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

రేపు, ఎల్లుండి ప్రత్యేక ఓటరు క్యాంపులు

మంగళగిరి: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.లక్ష్మీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాను ఓటర్లు పరిశీలించుకుని స్థానిక బీఎల్వోల ద్వారా సవరణలు చేయించుకోవాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 18 ఏళ్లు నండిన వారు ఓటరు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

పాము కాటు రక్షణపై అవగాహన



మంగళగిరి రైతులు వ్యవసాయ పనుల్లో పాములు పట్ల అప్రమత్తంగా ఉండాలని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు సూచించారు. నూతక్కి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. విషపూరిత పాము కాటేస్తే వెంటనే వైద్యుని వద్ద చికిత్స తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ఇంటింటికి తిరిగి రైతులకు పాము కాటు రక్షణపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, ఫీల్డు కో-ఆర్డినేటర్ పి.సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మీమామృతంతో పంటలకు రక్షణ



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్, వేములూరుపాడు, మునగపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పంటల రక్షణ బీజామృతం, మీమామృతం తయారీ గురించి వివరించారు. మోడల్ మేకర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేపాకు ఆవు పంచకం ఆవు పేడ నీరుకలిపి మీమామృతం తయారు చేసుకోవచ్చన్నారు. దానిని పంటలపై చల్లడం ద్వారా పురుగు ఉధృతి ప్రాథమిక దశలోనే తొలగించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటకు నాణ్యత చేకూరుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఐదు రోజుల శిక్షణ ముగిసిన అనంతరం వారిని క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించేందుకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అన్నామని, నరసింహారావు, శ్రీనివాస్, రామకృష్ణ, మోడల్ మేకర్స్ పాల్గొన్నారు.

23, 24న ఓటరు జాబితా సవరణలు

తాడికొండ: ఏపీ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈ నెల 23-24 తేదీలలో ఎలక్షన్ స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించడం జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్.గంగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి బీఎల్వో పోలింగ్ బూత్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. వారిని సంప్రదించి నూతన ఓటరు చేరిక, సవరణలు, ఇతర మార్పులు చేసుకోవాలన్నారు.

కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ

తెనాలిఅర్బన్: స్వచ్ఛంద్ర కార్పొరేషన్ వారు తెనాలి మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న ఎనిమిది మంది కార్మికులకు పంపిన తొమ్మిది రకాల పీపీఈ కిట్లను గురువారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్నలు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కిట్లు, మాస్కులు, ప్రత్యేక డ్రస్సు, గ్లౌజులు, షూలు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని ధరించి పారిశుద్ధ్య నిర్వహణ చేయడం వలన అనారోగ్య సమస్యలు దరిచేరవని చెప్పారు. అందరూ వీటిని ధరించాలని సూచించారు. ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మూడు నెలలకు కూడా పింఛన్ తీసుకోవచ్చు

ఎంపీడీఓ వి.విజయలక్ష్మి

కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల పెన్షన్ తీసుకునే లబ్ధిదారులు అనివార్య కారణాల వలన రెండు నెలలు వరకు పింఛన్ తీసుకోలేక ఉన్నవారు మూడవ నెలలో పింఛన్ తీసుకునే వెలుసుబాటు ఇకనుంచి కల్పించిందని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు వరుసగా రెండు నెలలు తీసుకోకపోతే మూడో నెలలో లబ్ధిదారుని పింఛను కనిపించేది కాదని ఇకనుంచి రెండు నెలలు తీసుకోకపోయినా మూడవ నెలలో రెండు నెలలు కలిపి మూడు నెలల పింఛన్ సొమ్మును తీసుకోవచ్చని తెలిపారు. మూడు నెలలు దాటితే పెన్షన్ జాబితాలో వారి పేరు కంప్యూటర్ ద్వారా లాక్ చేయడం జరుగుతుందని తెలిపారు.